సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ల పరిధిలోని 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌వి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి చంద్రమ్మ కాలనీకి చెందిన తన్నీరు మధుకు రూ.2. 50 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడి శ్రీనివాస్, రాజేష్ చంద్ర, కృష్ణారావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేతో అసోసియేషన్ నాయకులు

మోతీనగర్: మోతీనగర్‌లోని వి. రామారావునగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నె 28న బోనాల పండుగను నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి గురువారం బోనాల పండుగకు హాజరవ్వాలని ఆహ్వానాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఎన్. సత్యం , రఘుపతి, సాంబశివ,రెడ్డి పాల్గొన్నారు.

కదిరె కృష్ణపై ఫిర్యాదు

మోతీనగర్: హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరె కృష్ణపై అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. మళ్లీ అలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్. వెంకట్రాంరెడ్డి, జి. సుదర్శన్, అమ్రేష్ రాజ్, కురుమ బాబు, యాదగిరి, మల్లేష్, కేవీ రాజు తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రహదారులు బురదమయం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయి. కొన్నిచోట్ల సీసీ రోడ్లు లేకపోవడంతో చినుకు పడితే చిత్తడిగా మారిపోతున్నాయి. ఇప్పటికే తమ బస్తీలోకి భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు వచ్చాయని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.

మంచినీటి కనెక్షన్ ఇవ్వాలి

కూకట్‌పల్లి: హెచ్ఎంటీ శాతవాహన కాలనీ ప్లాట్ నెంబర్ 83 ఇంటి యజమాని రాములుకు మంచి నీటి కనెక్షన్ ఇవ్వాలని సీపీఎం నాయకులు గురువారం మెట్రో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ మాట్లాడుతూ.. 7 సంవత్సరాలుగా హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో నివాసం ఉంటున్న రాములుకు వెల్ఫేర్ అసోసియేషన్ వారు మంచినీటి కనెక్షన్ ఇవ్వకపోగా.. రెండు లక్షల రూపాయలను చెల్లించాలని వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై జనరల్ మేనేజర్ ప్రభాకర్‌ను వివరణ కోరగా.. రెండు, మూడు సంవత్సరాల నుంచి తమ దృష్టికి వచ్చిందని, వెల్ఫేర్ అసోసియేషన్ వారే ఈ సమస్యను పరిష్కరించాలని అన్నారు. తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో బి. రాములు, ఏ నరసింహ, గౌతమ్, రాములు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీటి అక్రమ కనెక్షన్లు తొలగించాలి

ఆల్విన్‌కాలనీ: తాగునీటి అక్రమ కనెక్షన్లు తొలగించాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ కోరారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వాటర్ వర్క్స్ డీజీఎం నాగ ప్రియకు వినతిపత్రం అందజేశారు. ఎల్లమ్మ బండ, పీజేఆర్ నగర్, ఎన్‌టీఆర్‌నగర్, దత్తాత్రేయ కాలనీ తదితర కాలనీల్లో నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అక్రమ కనెక్షన్లను తొలగించి సరిపడా నీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, నాయకులు కేశవరావు, రాజు, శ్రీనివాస్, రఘు, శివాజీ, కవిత, అనిత, సురేష్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.


వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పార్కు చుట్టూ చెత్తాచెదారం

- ఆహ్లాదం ఏమోగాని వెదజల్లుతున్న దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్, సందర్శకులు
- అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం




ప్రహరీ చుట్టూ పేరుకు పోయిన చెత్త

మోతీనగర్: ఉరుకుల పరుగుల జీవితంలో సమయం లేక ఎంతో మంది అనారోగ్యాల పాలవుతున్నారు. కొంతమంది సమయం కేటాయించి జాగింగ్, జిమ్, యోగాలో ఏదో ఒకటి ఎంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వీటిని చేయాలంటే పార్కులు, యోగా కేంద్రాలు, క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉండాలి. కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ లైబ్రరీ పార్కు ఆవరణ పైన పటారం, లోన లొటారం అన్న చందంగా మారింది. లోపల చూస్తే ఓపెన్ జిమ్ అందమైన గ్రీనరీ దర్శనమిస్తోంది. ప్రహరీ చుట్టూ మాత్రం ఎక్కడ చూసినా చెత్తా చెదారం, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే వాకర్స్, జిమ్‌కు వచ్చే వారు దుర్గంధం, దుర్వాసన భరిస్తూ పార్కులోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గాయత్రినగర్ కాలనీ నడిబొడ్డున లైబ్రరీ పార్కు గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం కృషితో పార్కును అభివృద్ధి చేశారు. వ్యాయామం చేయడానికి జిమ్ పరికరాలను సైతం ఏర్పాటు చేయించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓపెన్ జిమ్ పార్కు ప్రహరీ చుట్టూ చెత్తాచెదారం, ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు కనిపిస్తున్నాయి. పార్కు చుట్టు చెత్తా చెదారంతో ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. పార్కు ప్రహరీ చుట్టూ చెత్తా చెదారం, చెట్ల కొమ్మలు నెలల తరబడి ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లైబ్రరీ పార్కు చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పగలూ రాత్రీ.. పొగలు దిగులు

కాలుష్య కారక పరిశ్రమలకు అడ్డాగా ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ

- పట్టించుకోని ఐలా, పీసీబీ అధికారులు
- అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు


రాత్రిపూట ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ నుండి వెలువడుతున్న పొగలు

జీడిమెట్ల: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడంపై ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తుంటే కొన్ని పరిశ్రమలకు ఇవేమీ పట్టడంలేదు. నిబంధనలను తుంగలో తొక్కి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. జీడిమెట్లలోని ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోకి ఎవరైనా వచ్చి చూస్తే కాలుష్యం ఎంత పెద్ద ఎత్తున వెలువడుతుందో అర్థం అవుతుంది. ఇప్పటికైనా కాలుష్య కారక పరిశ్రమలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మమ్మల్ని ఎవరేమీ చేయలేరు..

ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో ఉన్న కొన్ని పరిశ్రమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పొగలను జనాల్లోకి వదులుతున్నాయి. పరిశ్రమల లోపల నల్లటి ఆయిల్‌ను మరిగించి వేడి చేసిన ఇనుప సామాన్లను అందులో ముంచుతారు. ఆయిల్‌ను మరిగించే క్రమంలో భరించలేని దుర్వాసన, పొగలు వెలువడుతున్నాయి. ఇదేంటని ఎవరైనా పరిశ్రమవారిని ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. అంటూ నిర్లక్ష్యంగా బదులిస్తున్నారు.

అమ్యామ్యాలు తీసుకుని మిన్నకుండి...

జీడిమెట్ల ఎస్వీ కోఆపరేటీవ్ సొసైటీలో ఉన్న ఓ ఐలా అధికారి ప్రతినెలా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల నుంచి అమ్యామ్యాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది సైతం వీరివద్ద నుంచి ప్రతినెలా ముడుపులు తీసుకుంటున్నట్లు పరిశ్రమల సిబ్బంది చెబుతున్నారు. కాలుష్యాన్ని అడ్డుకోవాల్సిన వారే కాసులకు కక్కుర్తి పడితే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిశ్రమలపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు అంటున్నారు.


పరిశ్రమలో ఉన్న నల్లటి అయిల్ డ్రమ్ములు

దుర్వాసన.. కళ్ల మంటలు



మేం 12 ఏళ్లుగా సుభాష్ నగర్‌లో ఉంటున్నాం. మా కాలనీకి ఆనుకుని ఉన్న ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని కొన్ని పరిశ్రమలు పగలు, రాత్రి తేడా లేకుండా పొగలను వదులుతున్నారు. దీంతో మాకు తీవ్రమైన దుర్వాసనతోపాటు కళ్లమంటలు వస్తున్నాయి. ఇప్పటికై నా పీసీబీ అధికారులు పట్టించుకోకపోతే ప్రజావాణిలో నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, సుభాష్‌నగర్

చర్యలు తీసుకుంటాం..



త్వరలోనే ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో పర్యటిస్తాం. గతంలో కాలుష్యానికి పాల్పడే పరిశ్రమలకు నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించాం. త్వరలోనే ఏస్వీ కో ఆపరేటీవ్ సొసైటీలో పర్యటించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, మేడ్చల్ జిల్లా పీసీబీ ఈఈ

నోటుపుస్తకాలు పంపిణీ



మోతీనగర్: కబీర్‌నగర్‌కు చెందిన రమేష్ అయ్యంగార్ శివ రామాంజనేయ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, షూ సాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాతల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తూము వేణు, రాఘవేంద్ర, సతీష్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, బుచ్చన్న, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా పాలనకు ఆకర్షితులై చేరికలు



ఎమ్మెల్యే గాంధీతో కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వాన్ని చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో సురేష్, గణేష్, సాయి, సైదులు, సందీప్, సాయి, చందు, మనోజ్, శ్రీనివాస్, విజయ్, నిఖిల్

వైభవంగా బోనాలు

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- అమ్మవార్లకు పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు, నాయకులు


భవానీ నగర్‌లో బోనాలతో అమ్మవారి విగ్రహం వద్ద మహిళలు


ప్రత్యేక అలంకరణలో భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి


పూజలో బండి రమేష్ తదితరులు


వేడుకల్లో వద్దేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ మహేందర్ తదితరులు


పూజలు చేస్తున్న వెంకటేశ్వరరావు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ సత్యనారాయణ

మూసాపేట: మూసాపేటలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి, నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ, మహంకాళి, సరస్వతి అమ్మవారు, జనతా నగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. మహిళలు వర్షంలో కూడా బోనాలను అమ్మవార్లకు సమర్పించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావు, మాజీ కార్పొరే టర్ తూము శ్రావణ్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు.

పూజలు నిర్వహించిన నాయకులు

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్‌లోని పలు అమ్మవార్ల ఆలయాలను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తూము వేణు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గూడ్స్‌షెడ్ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయ పూజలో పాల్గొన్న భక్తులు


పూజలో పాల్గొన్న కాంగ్రెస్ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, హరికృష్ణ


బోనాలతో మహిళలు


వర్షంలోనూ పూజలు చేస్తున్న మహిళలు


జనతానగర్‌లో ప్రత్యేక అలంకరణలో పోచమ్మ ఆలయం

బోనాల ఏర్పాట్లను పూర్తి చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: బోనాల సందర్భంగా ఆలయాల వద్ద ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ కోరారు. గురువారం మూసాపేట డివిజన్ పరిధిలోని బబ్బుగూడ నల్లపోచమ్మ దేవాలయం వద్ద స్థానిక నాయకులతో కలిసి బోనాల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న బోనాల పండుగ జరుగనున్నట్లు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోడ శ్రీనివాసరావు, నాయకులు శ్రీధర్‌గౌడ్ స్వామి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ నిందితుడి అరెస్ట్


నిందితుడు మణికంట

మోతీనగర్: జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఎవ్వరూ లేని ఇళ్లను చూసి చోరీలకు పాల్పడుతన్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంగారం, వివో ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. సీఐ సామల వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో నివాసం ఉండే కొల్లిపాకల మణికంట(నాని) కూకట్‌పల్లి, అల్లాపూర్ ప్రాంతాల్లో పగటి పూట తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను చూసి ఆభరణాలను చోరీ చేస్తున్నాడు. వాటి ద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. గాయత్రీనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం చేసిన విషయాన్ని ఒప్పుకున్నాడు. అతడి నుంచి బంగారు ఆభరణాలు, వివో ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. డివైడర్‌కు ఢీకొని..


ఫుడ్ డెలివరీ బాయ్‌కి ప్రాథమిక చికిత్స చేస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ

కుత్బుల్లాపూర్: రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ వాహనదారుడు పోలీసులను చూసి తప్పించుకోవాలనుకున్నాడు.. ఇదే క్రమంలో పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొని కింద పడ్డాడు.. ఇంతలో అక్కడే ఉన్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి గుర్తించి అతడికి ప్రాథమిక చికిత్స చేశారు. సుచిత్ర చౌరస్తా వద్ద బుధవారం రాత్రి రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను ఆపి అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో అటుగా రాంగ్ రూట్‌లో వచ్చిన జొమోటో డెలివరీ బాయ్ అనంత పూర్ణారావు తన ద్విచక్ర వాహనాన్ని వెనక్కి తీసుకునే క్రమంలో కింద పడిపోయాడు. అతని కాలుకు దెబ్బ తగలడంతో ఏసీపీ ప్రాథమిక చికిత్స చేయడం విశేషం. సదరు వ్యక్తి వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

బడ్జెట్‌లో విద్యకు మొండిచేయి



ప్రగతినగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. ఈ అన్యాయన్ని నిరసిస్తూ గురువారం ప్రగతినగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ. 21,389 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 21,292 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ప్రభుత్వ పాఠశాలలను మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని పేర్కొందని, ఈ బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించారని, ఇందులో మహిళా యూనివర్సిటీ రూ.200 కోట్లు పోగా, మిగిలిన రూ.300 కోట్లు అన్ని వర్సిటీలకు ఎట్లా సరిపోతాయని మండిపడ్డారు. అనంతరం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో గురుకులాలను విస్మరించారని, ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ అరుణ్, వంశీ, మనోజ్, జిల్లా కమిటీ సభ్యులు భగత్,శ్యామ్, శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, సుబ్బు, నిఖిల్, రాహుల్, ప్రణయ్, అజయ్, నవీన్, వాసు, రమ్య, కీర్తన, రేణుక, సుష్మ, సురేఖ, లావణ్య,యమునా పాల్గొన్నారు.

ఫోర్జరీ పత్రాలు సృష్టించిన ఇద్దరి రిమాండ్


నిందితులు కృష్ణ, కమ్మరి కుమార్

నిజాంపేట్: ఫోర్జరీ పత్రాలు సృష్టించిఓ మహిళకు చెందిన స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్న ఇద్దరు నిందితులను బాచుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాగిశెట్టి జయశ్రీ అనే మహిళకు ప్రగతినగర్‌లోని వాసవీ లేఅవుట్ సెక్టార్–4లోని సర్వే నెంబరు 169పి, 182పి, 159పిల పరిధిలో ప్లాట్ నెంబరు 135 కింద 244.44 గజాల స్థలం ఉంది. సదరు స్థలంపై కన్నేసిన సరాయి కృష్ణ, కుమ్మరి కుమార్ తమకు తెలిసిన సుబ్బారావు, మరో మహిళతో కలిసి తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ పేర్లపై రిజిస్టర్ చేసుకున్నారు. ఈ విషయంపై బాధితురాలు జయశ్రీ బాచుపల్లి పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సరాయి కృష్ణ, కమ్మరి కుమార్ తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించినట్లు నిర్ధారించి అరెస్టు చేశారు. గురువారం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది.